క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 40– 60, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 60, ఆలు 20, చామ 70, కీర 25, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 55, క్యాబేజీ 15, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10 ,క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 100.

నేడు శుభ శుక్రవారం ఆరాధనలు

హఫీజ్‌పేట్ : శుభ శుక్రవారంను పురస్కరించుకుని మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో శుక్రవారం ప్రత్యేక ఆరాధనలు నిర్వహిస్తున్నట్లు కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు ఆరాధనలు..ఉదయం 6 గంటలకు, 9 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6 గంటలకు ఉంటాయన్నారు. శుభ శుక్రవారం ఆరాధనల సమయంలో భక్తులు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వారి వివరించారు.

సీవి రామన్ టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటిన శ్రీనిత్



శ్రీనిత్‌ను అభినందిస్తున్న డీన్ శ్రీలత, ప్రిన్సిపల్ హైమ తదితరులు

మాదాపూర్: మాదాపూర్ రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర,జిల్లా స్థాయిలో జరిగిన సీవి రామన్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో సత్తా చాటారు. 4వ తరగతికి చెందిన బి.శ్రీనిత్ జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు డీన్ శ్రీలత, ప్రిన్సిపల్ హైమ, డివిజన్ ఇంచార్జ్ హాఫీజ్ గురువారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువే కాకుండా అన్ని రంగాలలో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఇఫ్తార్ విందు

మియాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని క్రిస్టల్ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అక్బర్‌ఖాన్ సోదరుల ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పటాన్‌చెరు టౌన్: మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని శిశుమందిర్ కాలనీ అకుబా మసీదులో ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ఎస్ఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

డీఈఎస్‌ను సందర్శించిన గీతం విద్యార్థులు



మాట్లాడుతున్న దయానందం

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, బీఎస్సీ స్టాటిస్టిక్స్, డేటా సెర్చ్ విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో గల డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్(డీఈఎస్)ను సందర్శించారు. గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ బీఎం నాయుడు మార్గదర్శనంలో డాక్టర్ శివారెడ్డి శేరి, డాక్టర్ నరసింహస్వామిల సమన్వయంలో నిర్వహించిన కార్యక్రమంలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఎస్ డైరెక్టర్ దయానందం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తమ సంస్థ ప్రభుత్వానికి అందిస్తున్న సేవల గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికాభివృద్ధి సంస్థ ఈఓ రామకృష్ణ, నాగరాజు, డీఈఎస్ డీఎస్ భారతి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి కేటీఆర్ మొదలు పెట్టిన గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గురువారం బోయినపల్లికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సిద్ధార్థకు టీఎస్‌టీఎస్‌పీ చైర్మన్ పాటిమీది జగన్‌మోహన్‌రావు ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సిద్ధార్థ జగన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు చెప్పాడు.

చాటింగ్.. చీటింగ్..

- పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- హనీ ట్రాప్, ఉద్యోగాలు, ఇన్వెస్ట్‌మెంట్, లోన్, కేవైసీ, గిఫ్ట్‌ల పేరిట టోకరా
- బాధితులు తెలంగాణ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ ఫోన్ 1930ని సంప్రదించాలి
- మాదాపూర్ పోలీస్‌స్టేషన్ డీఐ జి.వెంకట్





మాదాపూర్ పోలీస్‌స్టేషన్

మాదాపూర్: టెక్నాలజీ ఎంత పెరుగుతుందో సైబర్ నేరాలు అలాగే పెరుగుతున్నాయి. ఎక్కువగా విద్యావంతులు, మేధావులు సైబర్ నేరాలబారిన పడుతున్నారు. ఆన్‌లైన్‌లో యాప్స్ ద్వారా లోన్లు, ఉద్యోగాలు ఇస్తామని, న్యూడ్ చాట్‌లకు ఆహ్వానించి వీడియోలు తీసి బెదిరించి డబ్బులు గుంజుతున్నారని మాదాపూర్ క్రైం డీఐ (డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్) జి.వెంకట్ తెలిపారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాలను వాడే వారు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ మోసాలపై సాక్షికి పలు విషయాలను వివరించారు.

ప్రశ్న. ఎలాంటి నేరాలు ఎక్కువగా ఉన్నాయి.?

జ: ఇన్వెస్టిమెంట్, జాబ్, కేవైసీ, గిఫ్ట్, లోన్ నేరాలు ఎక్కువగా ఉన్నాయి. అత్యాశ, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశం ఉన్నవారు నేరగాళ్ల వలలో పడుతున్నారు. వివిధ రకాల యాప్స్ ద్వారా లోన్ ఇస్తామని చెప్పడం. లక్ష రూపాయల నుండి రూ.5 లక్షల వరకు ఇస్తామని నమ్మబలికి వ్యక్తిగత, బ్యాంక్ సమాచారం యాప్‌లో పొందుపరచడంతో పూర్తి సమాచారం రాగానే అకౌంట్‌ను హ్యాక్ చేసి వారి దగ్గర ఉన్న డబ్బును కాజేస్తున్నారు. లోన్ బ్యాంకులలోనే తీసుకోవాలి.

ప్ర: సైబర్ నేరాలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు.?

జ: హాస్టళ్ల వద్ద, పబ్లిక్ ప్రాంతాలలో, కార్యాలయాలలో, కమ్యూనిటీలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాము. ఆన్‌లైన్ చోరీల గురించి వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. నెలసరి జీతాలు వచ్చినప్పుడు, మార్చి ఎండింగ్ (కేవైసీ) సమయంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతుంటాయి. కేవైసీ సమాచారం ఇవ్వాలంటూ వివిధ రకాల బ్యాంకుల నుండి ఫోన్ చేస్తున్నట్లు చేసి సమాచారం రాబట్టి దోచేస్తున్నారు. అందంగా మాట్లాడే అమ్మాయిలని, అబ్బాయిలను ఎంపిక చేసుకుని వారితో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ప్ర: హనీట్రాప్ గురించి..

జ: న్యూడ్ చాట్‌లకు ఆహ్వానిస్తారు. వీడియోలు తీసి బెదిరిస్తారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాలను వాడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలి. అమ్మాయిలు నగ్న వీడియోలతో వల పన్ని తమ ఉచ్చులో చిక్కుకునేలా చేస్తుంటారు. కేవలం 4 నుండి 5 సెకన్లలో నగ్నంగా కనిపించి మాయమవుతారు. వీడియో చూసే దృశ్యాలను రికార్డ్ చేసి మళ్ళీ వారికే పంపి డబ్బులివ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తారు. హనీట్రాప్ వల్ల చాలా మంది యువకులు బ్లాక్‌మెయిల్‌కి గురై మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. అపరిచితులతో చాటింగ్ చేయొద్దు. ఫేస్‌బుక్‌లో అపరిచితుల పరిచయాలకు ఆకర్షితులు కావొద్దు. ఇలా జాగ్రత్తలు పాటించినట్లయితే భద్రంగా ఉంటారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడితే..

ప్రతి సంవత్సరం సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. వీటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. ఎక్కువ మంది చదువుకున్న వారే వీటి బారిన పడుతున్నారు. ఒక్కొక్కరు రెండు నుండి 5 సార్లు మోసపోతున్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే వెంటనే తెలంగాణ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ 1930కి కాల్ చేయాలి. దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి. వెంటనే చేయడం వల్ల పోయిన డబ్బును రికవరీ చేయడానికి వీలుంటుంది. 2022లో 353 సైబర్ నేరాలు వెలుగు చూడగా ..2023 మార్చి వరకు 81 కేసులు నమోదయ్యాయని డీఐ వెంకట్ పేర్కొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి


శోభాయాత్రలో ఎమ్మెల్యే గాంధీ తదితరులు

రాయదుర్గం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం, మధురానగర్, ఖాజాగూడ, ప్రశాంత్‌హిల్స్, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తండా, ఎన్టీఆర్‌నగర్, వినాయకనగర్, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, ఇందిరానగర్, టెలికామ్‌నగర్, కొత్తగూడ, కొండాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలలో స్వామి వారికి ఆకుపూజ, వడమాల, తులసి మాలలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలుచోట్ల హనుమాన్ విజయయాత్రను నిర్వహించారు.


జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో ..

శోభాయాత్ర..

మియాపూర్ : చందానగర్, మియాపూర్ డివిజన్‌లలో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చందానగర్‌లోని వేమనరెడ్డికాలనీలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ, మియాపూర్ ఏసీపీ నర్సింహారావులు హాజరయ్యారు. మియాపూర్, చందానగర్ పురవీధుల్లో శోభాయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బందోబస్తు.. ర్యాలీలు ప్రశాంతం

పీఎస్ఐఓసీ నుంచి పర్యవేక్షించిన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



సైబరాబాద్ కమిషనరేట్‌లో పీఎస్ఐఓసీ సెంటర్

రాయదుర్గం: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలు ప్రశాంతంగా ముగిశాయి. సైబరాబాద్ పరిధిలో పోలీసుల పర్యవేక్షణలో 184 ర్యాలీలు ప్రశాంతంగా సాగాయి. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్(పీఎస్ఐఓసీ) ద్వారా ప్రతి క్షణం సిబ్బంది పర్యవేక్షించారు. బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సీపీ స్టీఫెన్ రవీంద్ర పర్యవేక్షిస్తూ ర్యాలీల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ సైబరాబాద్ పోలీసులు ముందస్తుగా తీసుకున్న భద్రతా చర్యల్లో భాగంగా సోషల్ మీడియాపై నిఘా ఉంచామని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ర్యాలీలు ప్రశాంతంగా కొనసాగాయన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ


భెల్ ఎంఐజీ కాలనీలోని థీమ్ పార్కును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గాంధీ, కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని భెల్ ఎంఐజీ కాలనీలో పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ వి.సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, గ్రంథాలయాన్ని ప్రారంభించడంతో పాటు యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా కాలనీలో నిర్మిస్తున్న థీమ్ పార్కును పరిశీలించి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, డీఈ రమేష్, ఏఈ రమేష్, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్, మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, నాగమణి, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్ఎస్

- ఎమ్మెల్యే గాంధీ


లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఇస్తున్న ఎమ్మెల్యే గాంధీ, చంద్రారెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. జీఓ నెంబర్ 59 ప్రకారం కూకట్‌పల్లి సర్కిల్ పాపిరెడ్డినగర్‌కు చెందిన 6 మంది ప్రభుత్వం నిర్ణయించిన ధరను చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుని పత్రాలను గురువారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా నివాసముంటున్న నిరుపేదలకు రెగ్యులరైజ్ చేసి వారికి భరోసా కల్పించిన గొప్ప మహానుభావుడు కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, నాయకులు ప్రేమకుమార్, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీలోని సందుగూడెం తండాలో ఎమ్మెల్యే సొంత నిధులతో చేపట్టిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుతో పాటు ఈద్గా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పకుండా దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లారెడ్డి, కౌన్సిలర్లు లచిరాంనాయక్, బాలాజీ, నాగరాజు, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు దేవేందర్‌యాదవ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సాగర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


కొండాపూర్‌లో ..బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, ఇతర నాయకులు


నానక్‌రాంగూడలో జెండాను ఆవిష్కరించిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి/రాయదుర్గం: ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీకి గుర్తింపు ఉందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొండాపూర్ డివిజన్‌లో అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావుతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం, దేశ అభివృద్ధి కోసం నిస్వార్థంగా అవినీతి రహిత పాలన చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, హన్మంతునాయక్, తిరుపతయ్య, జితేందర్, రమణసాగర్ నాయక్, విశాల్ పాల్గొన్నారు. అలాగే నానక్‌రాంగూడ ,గౌలిదొడ్డిలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ,పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించారు.

ముగ్గురికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 16 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పటాన్‌చెరు టౌన్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి కావలి వీరేశం, సుధాకర్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు పుణ్యవతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధన్‌రాజ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజుగోపాల్‌యాదవ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి దీపక్‌గౌడ్, ఎస్ఆర్‌కె యువసేన నాయకులు దస్తగిరి, శ్రీను, సంఘమేష్, అజయ్, వీరేశం పాల్గొన్నారు.

హనుమాన్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని రుద్రారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాండు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, మాజీ ఎంపీపీలు శ్రీశైలంయాదవ్, గాయత్రిపాండు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రుద్రారం సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పూజలు

హనుమాన్ జయంతి సందర్భంగా డివిజన్ పరిధిలోని కోదండ సీతారామస్వామి ఆలయం, జేపీ కాలనీలోని పంచముఖి హనుమాన్ ఆలయం, శాంతినగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, చైతన్యనగర్ కాలనీ, నర్రబస్తీలోని ఆలయాల్లో కార్పొరేటర్ మెట్టు కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పటాన్‌చెరు టు తిరుపతి, చెన్నై



బస్సు సర్వీస్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఏసీ స్లీపర్ బస్ సర్వీస్‌లు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడంలో ఆర్టీసీ ముందుంటుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని భెల్ ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, చెన్నైకి నూతనంగా ఏర్పాటు చేసిన లహరీ ఏసీ స్లీపర్ బస్ సర్వీస్‌లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ పల్లె నుంచి పట్టణాల వరకు మెరుగైన సేవలను అందిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన భద్రతతో కూడిన రవాణా సౌకర్యాన్ని కల్పించడంలో ఆర్టీసీ ఎంతో కృషి చేస్తోందని వివరించారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ నష్టాల్లో నడిచేదని, సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. అదే విధంగా ఆర్టీసీ కార్గో సేవలు అద్భుతమైన ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేశ్, డిపో మేనేజర్ సుధాకర్ రావు, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పాత మార్కెట్ సమీపంలో రూ.12లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.5కోట్లతో వివిధ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.

చెరువు గుంతలో పడి వ్యక్తి మృతి


మల్లేష్ (ఫైల్)

మియాపూర్: ప్రమాదవశాత్తు చెరువు గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని టీఎన్‌నగర్‌కు చెందిన మల్లేష్ (33) భార్య శంకరమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఓ కుమారుడు ఉన్నారు. మల్లేష్ స్థానికంగా జలమండలి కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. బుధవారం ఉదయం విధులకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం మధ్యాహ్నం పటేల్ చెరువులో వ్యక్తి పడి ఉన్నాడని సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మల్లేష్‌గా గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నష్టపరిహారం అందించాలని డిమాండ్

మృతి చెందిన మల్లేష్ కుటుంబ సభ్యులకు నష్టపరిహారం ఇవ్వాలని ఎంసీపీఐయూ నాయకులు, కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గత 5 సంవత్సరాల నుండి అభివృద్ధి పనుల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆ ప్రదేశంలో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా అలాగే వదిలేయడం వల్ల మల్లేష్ గుంతలో పడి మృతి చెందాడని అన్నారు. గతంలో ఓ బాలుడు ఆడుకుంటూ వెళ్లి మృతిచెందినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని ఎంసీపీఐయూ నాయకులు సుధాకర్,దశరథ్ నాయక్, అనిల్‌కుమార్, మురళీలు డిమాండ్ చేశారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

మోతీనగర్ ప్రధాన రోడ్డులో తరచూ ప్రమాదాలు


మోతీనగర్ ప్రధాన రోడ్డులో ప్రమాదం జరిగిన దృశ్యం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పైగా ఈ రోడ్డు హైటెక్ సిటీ రహదారి కావటంతో రాత్రిపూట సైతం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు సమీపంలో హోటళ్లు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలు, మినీ ఫంక్షన్‌హాలు ఉన్నాయి. పైగా రోడ్డు ఇరుకు కావడంతో ఏ వాహనం ఎటునుంచి వచ్చి ఢీకొంటుందోనని భయం కలుగుతోందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ వ్యాపారులు , వాహనాలు పార్కింగ్‌తో రోడ్డు కుచించుకుపోతోంది. ఇటీవల రెండు ద్విచక్రవాహనాలు అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో ఇద్దరు ఆసుపత్రి పాలయ్యారు. మోతీనగర్, బోరబండ, శ్రీరాంనగర్, రహ్మత్ నగర్, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల నుంచి ఎక్కువగా రాకపోకలు చేస్తుంటారు. స్పీడు బ్రేకర్లు లేకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు ఒకవైపు ఎస్ఆర్‌నగర్, రెండవ వైపు బాలానగర్ ఉండటంతో ఎవరూ పట్టించుకోవటం లేదు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

> **ఇరుకు..రద్దీ**
>
> మోతీనగర్ ప్రధాన రోడ్డు ఇరుకుగా ఉండటంతో బాటు వాహనాల రద్దీ ఉంటుంది. దీనికి తోడు స్పీడు బ్రేకర్లు లేకపోవటంతో వాహనాల వేగంగా వస్తుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. –వేణు, మోతీనగర్